సాక్షి
రంగారెడ్డి

బుధవారం । 16 । ఆగస్టు । 2023



ప్రజలకు చేరువలో పాలన

పాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం జిల్లాలు, డివిజన్లలో ప్రభుత్వ కార్యాలయాలతో ప్రజలకు సేవలను చేరువ చేస్తోంది. 8లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం

తుర్కయంజాల్: జిల్లాలో ఈ నెల 16 (బుధవారం) నుంచి 31వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి తగిన చికిత్సలు అందించే కార్యక్రమం చేపట్టనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకటేశ్వర రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికీ తిరిగి ఎవరికైనా స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉన్నట్లైతే, వారిని గుర్తించి దగ్గరలోని వైద్యాధికారి వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాలని సూచించారు. జిల్లా కుష్టు నిర్మూలన అధికారి డా. అరుణ మాట్లాడుతూ.. వ్యాధి గ్రస్తులను గుర్తించి చికిత్స అందించడంతో పాటు, రిహాబిలిటేషన్‌కు తరలించనున్నట్లు తెలిపారు. లక్షణాలు కనిపించిన ప్రతి ఒక్కరూ సకాలంలో చికిత్స తీసుకుంటే సులువుగా బయట పడొచ్చన్నారు.

నేడు ఫార్మాసిటీ భూ బాధితులకు పట్టాల పంపిణీ

యాచారం: ఫార్మాసిటీకి భూములిచ్చిన పలు గ్రామాలకు చెందిన పట్టా భూముల రైతులకు బుధవారం ఇళ్ల స్థలాల పట్టా సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు చెందిన 421 మంది భూ బాధితులకు ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని సాయి శరణం ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి చేతుల మీదుగా పట్టా సర్టిఫికెట్ల పంపిణీ ఉంటుందన్నారు.

చేవెళ్ల కాంగ్రెస్ సభ 24కు వాయిదా



చేవెళ్ల నియోజకవర్గం నాయకులతో చర్చిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

చేవెళ్ల: ఈనెల 18న నిర్వహించాల్సిన చేవెళ్ల కాంగ్రెస్ సభను 24కు వాయిదా వేసినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మంగళవారం చేవెళ్లలో నిర్వహించబోయే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ బహిరంగసభపై గాంధీభవన్‌లో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, చేవెళ్ల నియోజకవర్గ నాయకులతో కలిసి చర్చించారు. 18న సభ నిర్వహణకు సమయం తక్కువగా ఉండడంతో 24న నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని సూచించినట్లు సమాచారం. కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఫయ్యూమ్, టీపీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం,షాబాద్ దర్శన్, పామెన బీంభరత్ తదితరులు పాల్గొన్నారు.

18న పీజీ ప్రవేశ పరీక్షల ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా 30 కేంద్రాల్లో జూన్ 30 నుంచి జూలై 10 వరకు జరిగిన ఉమ్మడి పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షల ఫలితాలు ఈ నెల 18న విడుదల కానున్నాయి. టీఎస్‌పీజీసీఈటీ–2023 భాగంగా ఓయూ నిర్వహించిన 44 పీజీ కోర్సుల ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో అధికారులు విడుదల చేయనున్నారు.

24 గంటల తాగునీటి సరఫరాకు ప్రణాళిక

జలమండలి ఎండీ దాన కిశోర్



సాక్షి, సిటీబ్యూరో: భవిష్యత్తులో 24 గంటలు తాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జలమండలి ఎండీ దానకిశోర్ వెల్లడించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం ఖైరతాబాద్‌లోని ప్రధానకార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర భవిష్యత్తు తాగునీటి అవసరాల దృష్ట్యా అదనంగా మరో 10 టీఎంసీల నీటిని సరఫరా చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. మురుగు నీటి నుంచి హైడ్రోజన్ ఇంధనాన్ని ఉత్పత్తి చేసేందుకు సన్నాహాలు చేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న దళితబంధు పథకంలో భాగంగా కార్మికులకు 160 వాహనాలను త్వరలో అందిస్తామన్నారు. అనంతరం దానకిశోర్‌ను రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ పి.నారాయణ సన్మానించారు.



విద్యార్థుల ప్రదర్శన



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో కలెక్టర్ హరీశ్ తదితరులు

సంక్షేమంలో టాప్

- దేశానికే తెలంగాణ రోల్ మోడల్
- పథకాల అమలు ఘనత మాదే
- దశలవారీగా అభివృద్ధి పనులు
- పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తాం
- స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి సబిత
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సకల జనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల అమల్లోనే కాదు అభివృద్ధి పనుల విషయంలోనూ తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. 77వ స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ధరణి పోర్టల్‌కు 1,92,827 దరఖాస్తులు రాగా, వీటిలో 28,109 మినహా మిగిలిన వాటన్నింటినీ పరిష్కరించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు త్వరలో పరిష్కార మార్గం చూపనున్నట్లు ప్రకటించారు.

రైతులకు పెద్దపీట

రైతు బీమా పథకంలో భాగంగా 2022–23 సంవత్సరంలో 893 మంది రైతులు మృతి చెందగా, ఇప్పటి వరకు 794 మంది రైతు కుటుంబాలకు రూ.39.70 కోట్ల ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. రుణమాఫీ పథకంలో భాగంగా మొదటి విడతలో వివిధ బ్యాంకుల నుంచి రూ.25 వేల లోపు రుణాలు పొందిన 10,940 మంది రైతులకు రూ.16.73 కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. ఇక రెండో విడతలో రూ.50 వేలలోపు రుణాలు పొందిన 24,013 మంది రైతులకు రూ.31.14 కోట్ల రుణాలను మాఫీ చేసినట్టు చెప్పారు.

ఆ జీఓలతో పేదలకు లబ్ధి

జిల్లా వ్యాప్తంగా జీఓ నంబర్ 58 కింద 19,661 దరఖాస్తులు రాగా, వీటిలో 4,552 దరఖాస్తులను పరిశీలించి, ఇప్పటి వరకు 2,681 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశామన్నారు. జీఓ నంబర్ 59 కింద 13,231 దరఖాస్తులు రాగా, వీటిలో 3,871 పరిశీలించి, 3,751 మందికి పట్టాలు పంపిణీ చేశామన్నారు. 118 జీఓ కింద 30 కాలనీల నుంచి 5,802 దరఖాస్తులు రాగా, 4,959 ఆమోదించినట్లు తెలిపారు. గృహలక్ష్మి పథకం కింద 22,150 మందికి ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపారు.

అభివృద్ధిలో ముందడుగు

పట్టణ ప్రగతిలో భాగంగా జిల్లాకు రూ.129 కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు వివిధ అభివృద్ధి పనులకు రూ.77 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. నాలుగు చెక్‌డ్యాంలకు రూ.10.27 కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు రూ.7 కోట్లు ఖర్చు చేసి ఒక చెక్ డ్యాం పూర్తి చేయడం జరిగిందన్నారు. మన ఊరు– మనబడి పథకం కింద జిల్లాలో 464 స్కూళ్లను ఎంపిక చేసి, ఇప్పటికే 54 పాఠశాలల్లో పనులు పూర్తి చేశామని, మరో 410 స్కూళ్లలో పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కందుకూరు–మీర్‌ఖాన్‌పేట వరకు రూ.85 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు, నాగులపల్లిరోడ్డు–షాద్‌నగర్‌లో రూ.5 కోట్లతో చేపట్టిన ఆడిటోరియం నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. రూ.403 కోట్ల అంచనా వ్యయంతో కోహెడలో 199 ఎకరాల్లో ఆసియాలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్‌ను నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

మున్సిపాలిటీల్లో ప్రగతి పరుగులు

శంషాబాద్ మున్సిపాలిటీలో రూ.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు పరిపాలన అనుమతి లభించిందన్నారు. షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలిటీలకు రూ.10 కోట్ల చొప్పున, ఫరూఖ్‌నగర్, నందిగామ, కొత్తూరు మండలాలకు రూ.5 కోట్ల చొప్పున నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. షాద్‌నగర్‌నగర్ నియోజకవర్గానికి రూ.60 కోట్లు, కల్వకుర్తి నియోజకవర్గానికి రూ.15 కోట్లు అదనంగా మంజూరయ్యాయని చెప్పారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలకు రూ.150 కోట్లు సీఎం కేసీఆర్ మంజూరు చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గం పరిధిలోని 66 గ్రామాలకు రూ.9.90 కోట్లు మంజూరు చేశారని వివరించారు. వేడుకల్లో ఎమ్మెల్సీ ఏవీఎస్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు భూపాల్ రెడ్డి, ప్రతిమాసింగ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎండలోనే విద్యార్థులు

వేడుకల్లో భాగంగా ఆమనగల్లు కేజీబీవీ స్కూలు విద్యార్థులు ప్రదర్శించిన 'వందేమాతరం.. వందే మాతరం..' అన్న దేశభక్తి నృత్య రూపకం ఆకట్టుకుంది.శంకర్‌పల్లి ప్రభుత్వ మోడల్ స్కూలు విద్యార్థులు ప్రదర్శించిన 'ఎల్లమ్మ...ఎల్లమ్మ' జానపద నృత్యం,చంపాపేట్ త్రివేణి స్కూలు విద్యార్థులు జా తీయ సమైక్యతను చాటిచెబుతూ ప్రదర్శించిన నృత్యరూపకం అలరించాయి. ఇదిలా ఉండగా వేడుకలకు హాజరైన వారికి సరిపడా కుర్చీలే కాదు కనీసం టెంట్లు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఉద యం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యార్థులంతా ఎండలోనే మగ్గాల్సి వచ్చింది.



జెడ్పీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ అనితారెడ్డి



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



విద్యార్థుల నృత్య ప్రదర్శన

మువ్వన్నెల్లో మురిసిన శివయ్య

మొయినాబాద్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రాంగణంలోని శివయ్య జాతీయ జెండా అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. శివాలయంలోని సుందరేశ్వరస్వామిని మంగళవారం జాతీయ జెండాలోని మూడు రంగులు వచ్చేలా పచ్చని ఆకు, తెల్ల చామంతి, కనకాంబరం, బంతి పూలతో అలంకరించారు. స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిలుకూరుకు భారీగా తరలివచ్చిన భక్తులు..

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం సెలవు రోజు కావడంతో చిలుకూరు బాలాజీ దేవాలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. గర్భగుడి చుట్టూ ప్రదక్షిణలు పూర్తిగా నిలిపివేసి రెండు వరుసల్లో భక్తులు స్వామివారిని దర్శించుకునేలా మహాద్వార దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణమంతా రద్దీగా కనిపించింది.



మూడు రంగుల జాతీయ జెండా అలంకరణలో సుందరేశ్వరస్వామి

ప్రపంచంలోనే ఆదర్శం హరితహారం

- అభివృద్ధి ఘనత కేసీఆర్‌దే
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

మొయినాబాద్‌రూరల్: ప్రపంచంలోనే హరితహారం ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తోల్‌కట్ట సమీపంలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ మోడల్ స్కూల్‌లో మంగళవారం ఎమ్మెల్సీ వాణీదేవి ఆధ్వర్యంలో ఔషధ హరితహార కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఔషధ మొక్కలు నాటారు. అనంతరం కవిత మాట్లాడుతూ 2014లో ముఖ్యమంత్రి కేసీఆర్ చిలుకూరు బాలాజీ దేవాలయం నుంచి మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. తొమ్మిదేళ్ల పాటు నిరంతరాయంగా కొనసాగిస్తుండడంతో మొక్కలు చెట్లుగా ఎదిగి వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా వైకుంఠధామాలు, నర్సరీలు, వన పార్కులు, డంపింగ్ యార్డులు, చెత్త బండి ట్రాక్టర్లు, ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇవ్వడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ.. పీవీ నర్సింహారావు జ్ఞాపకాలు మరిచిపోలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీకాంత్, ఎంపీపీ నక్షత్రంజేవంతు, బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు స్వప్న, తోల్‌కట్ట సర్పంచ్ శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

గ్రీన్ సిగ్నల్

- వచ్చే నెలలో ఎయిర్‌పోర్టు మెట్రో పనులు
- సకాలంలో పూర్తి చేసేందుకు కార్యాచరణ
- ఎల్‌అండ్‌టీ చేతికే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు
- త్వరలో అధికారికంగా వెల్లడించే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టు పనులు వచ్చే నెలలో ప్రారంభం కానున్నాయి. నిర్ణీత గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేసేలా హెచ్‌ఏఎంఎల్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించింది. మరోవైపు రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు 31 కిలోమీటర్ల మార్గంలో నిర్మించనున్న ప్రాజెక్టును ఎల్‌అండ్‌టీ సంస్థ దక్కించుకుంది. త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ప్రాజెక్టు నిర్మాణానికి 13 అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు పోటీ పడగా చివరికి ఎల్‌అండ్‌టీతో పాటు ఎన్‌సీసీ సంస్థలో బరిలో పోటీకి నిలిచిన సంగతి తెలిసిందే. ఈ రెండు సంస్థలు రూ.5,688 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ముందుకు వచ్చాయి. దీంతో నిర్మాణ రంగంలో ఉన్న అపారమైన అనుభవం, మెట్రోరైల్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన అర్హతలు, ప్రామాణికత, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, యంత్రాలు, నిర్మాణ పద్ధతులు, వివిధ రంగాల్లో ఇప్పటి వరకు పూర్తి చేసిన నిర్మాణాలు, ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణంలో అనుభవాలు తదితర అంశాలను ప్రాతిపదికగా చేసుకొని అంతిమంగా ఎల్‌అండ్‌టీ సంస్థ ఎంపిక చేసినట్లు సమాచారం.

పూర్వానుభవంతో..

నగరంలో 72 కి.మీ మెట్రో రైల్ మార్గాన్ని నిర్మించిన అనుభవం కూడా ఉంది. దీంతో ప్రతిష్ఠాత్మకమైన ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టును త్వరలోనే ఆ సంస్థకు అప్పగించే అవకాశం ఉంది. మరోవైపు ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు సుమారు 31 కి.మీ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ కోసం ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో నిర్మించనున్నారు. వచ్చే నెలలో పనులు ప్రారంభించి 36 నెలల్లో పూర్తి చేసేలా హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు.

పూర్తి బాధ్యత నిర్మాణ సంస్థదే..

- ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్ పూర్తయింది. పెగ్‌మార్కింగ్ కూడా చేశారు. భూసార పరీక్షలు సైతంపూర్తయ్యాయి. త్వరలో నిర్మాణ సంస్థకు పనులను అప్పగించనున్నారు. సెప్టెంబరులోనే పనులు చేపట్టనున్నారు. రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు 31 కి.మీ మార్గంలో 29.3 కి.మీ ఎలివేటెడ్ కారిడార్ కాగా, మరో 1.7 కి.మీ మార్గంలో భూగర్భ లైన్లు నిర్మించనున్నారు. ఎయిర్‌పోర్ట్‌లో నిర్మించనున్న మెట్రోస్టేషన్ కూడా భూగర్భంలోనే ఉంటుంది. ఇప్పటి వరకు 9 స్టేషన్లను గుర్తించారు. మరో 3 స్టేషన్లు కొత్తగా చేరే అవకాశం ఉన్నట్లు అంచనా. మెట్రో మొదటి దశ ప్రాజెక్టును పీపీపీ పద్ధతిలో నిర్మించగా ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వమే పూర్తిగా నిధులను అందజేస్తుంది.
- మొదటి దశ మెట్రోలో డిజైన్,బిల్డ్,ఫైనాన్స్,ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ విధానాన్ని పాటించారు. ఈ మేరకు హెచ్ఎంఆర్ఎల్‌తో పాటు, ఎల్‌అండ్‌టీ సంస్థలు కూడా భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. ఎయిర్‌పోర్టు మెట్రో పూర్తిగా ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న ప్రాజెక్టు. అందుకే దీన్ని ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ పద్ధతిలో నిర్మించనున్నారు. ఈ నిర్మాణంలో భాగంగా ప్రాజెక్టును చేపట్టిన సంస్థే ఎలివేటెడ్ వయాడక్ట్‌తో పాటు ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్ పనులు చేపట్టాల్సి ఉంటుంది. ట్రాక్స్, రోలింగ్ స్టాక్, విద్యుత్, టెలీ కమ్యూనికేషన్స్, ఆటోమేటిక్ ఫేర్ సిస్టమ్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అనంతరం నిర్వహణ బాధ్యత ప్రభుత్వ అధీనంలోనే ఉంటుంది.

ఔటర్ అంచుల్లో మణిహారం

ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణంతో నగరంలో పడమటి వైపు నుంచి దక్షిణాది అభివృద్ధి పరుగులు పెట్టే అవకాశం ఉంది. నిర్మాణరంగం ఉరకలు వేయనుంది. ఔటర్ మార్గంలో 31 కి.మీ వరకు అద్భుతమైన మణిహారంలా భాసిల్లనుంది. ఎయిర్‌పోర్టు మెట్రో అందుబాటులోకి వస్తే ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులకే కాకుండా నార్సింగి, కోకాపేట్, మణికొండ, బుద్వేల్ తదితర ప్రాంతాల నుంచి శంషాబాద్ వరకు సాధారణ ప్రజలకు కూడా రవాణా సేవలు లభిస్తాయి. మరోవైపు 111 జీఓను రద్దు చేసిన దృష్ట్యా ఆ ప్రాంతాల ప్రజలకు కూడా మెట్రో సేవలు అందుబాటులోకి వస్తాయంటున్నారు.



అమరులను స్మరించుకుందాం

కాంగ్రెస్, బీజేపీ జిల్లా కార్యాలయాల్లో మంగళవారం నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో ఆయా పార్టీల జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, బొక్క నర్సింహారెడ్డి హాజరై జాతీయ పతాకాలను ఎగురవేశారు. స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన అమరులను స్మరించుకున్నారు. దేశం పట్ల ప్రేమ, దేశభక్తి కలిగి ఉండాలని కోరారు. – సాక్షి, నెట్‌వర్క్



క్రీడల్లో గెలుపోటములు సహజం

టీటీడీ బోర్డు సభ్యుడు భాస్కర్‌రావు

మొయినాబాద్‌రూరల్: క్రీడలతో శరీర ధారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు కావేరి భాస్కర్‌రావు, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవియాదవ్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో శాంతియువజన సంఘం అధ్యక్షుడు నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి భాస్కర్‌రావుతో పాటు అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవియాదవ్ హాజరయ్యారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్యామ్‌రావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నర్సింహ, వార్డు సభ్యులు యాదయ్య, నాయకులు అశోక్‌యాదవ్, యాదయ్య, శాంతి యువజన సంఘం మాజీ అధ్యక్షుడు మల్లేష్, స్థానిక నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందజేస్తున్న భాస్కర్‌రావు, అతిథులు

హైనా దాడిలో గేదె మృతి

కడ్తాల్: మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో హైనా దాడిలో గేదె మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. చల్లంపల్లి గ్రామానికి చెందిన రైతు ప్రవీన్‌యాదవ్ రోజులాగే సోమవారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలో పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం పాలు పితికేందుకు పొలం వద్దకు వెళ్లి చూడగా గేదె మృతిచెంది ఉంది. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారి హుస్సేన్ చల్లంపల్లికి చేరుకుని.. పొలం పరిసరాల్లో ఆనవాళ్లను గుర్తించి గేదెను చంపింది హైనా అని నిర్ధారించారు. ప్రభుత్వపరంగా సాయం అందిస్తామని ఆయన తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్ రైతును పరామర్శించారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ప్రమాదాల నివారణకు భారతి సిమెంట్ సహకారంతో, బాలాజీ స్టీల్ అండ్ సిమెంట్ షాపు యజమాని కర్నాటి శ్రీధర్‌రెడ్డి 4 బారికేడ్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం వారు పట్టణంలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేశారు.

అనుమతులు లేకుండా షెడ్డు నిర్మాణం

కేశంపేట: ఎలాంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి ఓ ఇంటి ముందు రేకుల షెడ్ వేసుకున్న వ్యక్తికి గ్రామ పంచాయతీ అధికారులు నోటీసు అందించారు. వివరాలు.. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి ఎదురుగా గ్రామానికి చెందిన నీలమ్మకు 143 చదరపు గజాల విస్తీర్ణంలో ఇళ్లు ఉంది. అట్టి స్థలంలో ఇంటి ముందున్న 12 చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించి ఓ వ్యక్తి రేకుల షెడ్ వేసినట్టు గ్రామ పంచాయతీ నోటీసులో పేర్కొంది. నోటీసు అందిన రెండు రోజుల్లోగా షెడ్‌ను తొలగించాలని లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి విద్యావతి, గ్రామ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



నందిగామ: రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు(22) మృతి చెందిన సంఘటన నందిగామ శివారులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం వివరాలు.. గుర్తుతెలియని యువకుడి మృతదేహం నందిగామ శివారులోని రిలయన్స్ పెట్రోల్ పంపు వెనకాల రైల్వే ట్రాక్ పక్కన పడిఉందని మంగళవారం ఉదయం పోలీసులకు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతుడి వయస్సు సుమారు 22 ఏళ్లు ఉంటుందని, రైలు ఢీకొట్టడంతో మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకున్నాడా.. లేక ప్రమాదవశత్తు జరిగిందా అనే విషయం విచారణ అనంతరం తెలుస్తుంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలకు 98480 90426 నంబరును సంప్రదించాలని సూచించారు.

ప్రజలకు చేరువలో పాలన

- ఇబ్రహీంపట్నంకు మరో రెండు ప్రభుత్వ కార్యాలయాలు
- త్వరలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డివిజన్, విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయాల ఏర్పాటు
- తీరనున్న అర్జీదారుల, ప్రజల ఇబ్బందులు



ఇబ్రహీంపట్నం రూరల్: పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలు, డివిజన్లలో ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలను చేరువ చేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సర్కిల్స్, డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో కూడా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయాలను ఏర్పాటు చేయనుంది. ఉద్యోగుల నియామకంతో పాటు కొత్త పరిపాలన భవనాలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.


జిల్లాకు రెండు డివిజన్లు చేయడంతో..

ఇప్పటివరకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం డివిజన్ కార్యాలయం జిల్లా పరిషత్‌లో మాత్రమే ఉండేది. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని మండలాల నుంచి సీడీపీ, ఎన్ఆర్ఈజీఎస్‌తో పాటు ఇతర నిధులకు సంబంధించి జిల్లా పరిషత్ కార్యాలయం నుంచే పరిపాలన సాగేది. ఒక్కరే ఈఈ ఉండేవారు. ప్రస్తుతం జిల్లాకు రెండు డివిజన్లు చేశారు. దీంతో ఇబ్రహీంపట్నం కేంద్రంగా ఈ కార్యాలయం కొనసాగనుంది. అబ్దుల్లాపూర్‌మెట్ సబ్‌డివిజన్ కింద మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలు, ఆమనగల్లు సబ్‌డివిజన్ కింద మాడ్గుల, ఆమనగల్లు మండలాలు, ఇబ్రహీంపట్నం సబ్‌డివిజన్ కింద ఇబ్రహీంపట్నం, మంచాల మండలాలు, కొత్తగా కడ్తాల్ సబ్‌డివిజన్ ఏర్పాటు కాగా దీని కింద కడ్తాల్, తలకొండపల్లి మండలాలు, మహేశ్వరం సబ్‌డివిజన్ కింద కందుకూర్, మహేశ్వరం మండలాలు చేర్చారు. వీటి ద్వారా పరిపాలన సులభతరం కానుంది.

తీరనున్న ఇబ్బందులు..

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో ఇప్పటివరకు విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం జిల్లాకు ఒక్కటే ఉండేది. ప్రభుత్వం రీఆర్గనైజేషన్‌లో భాగంగా ఇబ్రహీంపట్నంకు సబ్‌డివిజన్ కార్యాలయం మంజూరు చేసింది. ఇక్కడ డీఈ పర్యవేక్షణ ఉంటుంది. ఇప్పటివరకు ఇదే కార్యాలయం ఉప్పల్‌లో ఉండటం వలన ఇబ్రహీంపట్నంతో పాటు ఇతర ప్రాంతాలవారు అక్కడికి వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. కొత్తగా ఇబ్రహీంపట్నం సబ్‌డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆ ఇబ్బందులు తీరనున్నాయి. దీనికి తోడు ఆయా కార్యాలయాల రాకతో స్థానికంగా అభివృద్ధి మరింత వేగం పుంజుకోనుంది.

త్వరలో కార్యాలయాల ఏర్పాటు



రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మేనెలలో అన్ని ప్రభుత్వ శాఖలను రీఆర్గనైజ్ చేసింది. అందులో భాగంగానే ఇబ్రహీంపట్నంకు రెండు కొత్త కార్యాలయాలను మంజూరు చేసింది. ఇంజనీరింగ్ డివిజన్ కార్యాలయం, క్వాలిటీ కంట్రోల్ విజిలెన్స్ సబ్‌డివిజన్ కార్యాలయం. వీటిని వీలైనంత త్వరగా ఇబ్రహీంపట్నంలోనే ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వంతో మాట్లాడుతాను. అన్ని కార్యాలయాలు ఇబ్రహీంపట్నం కేంద్రంగానే నడిచేలా చూస్తా.

– మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

అభివృద్ధి చూసే బీఆర్ఎస్‌లో చేరికలు

ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్‌రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పనులను చూసి ఇతర ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో పెద్ద ఎత్తున నాయకులు చేరుతున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీలు కవిత, వాణీదేవి అన్నారు. మండల పరిధిలోని తోల్‌కట్ట చౌరస్తాలో గ్రామానికి చెందిన వన సంరక్షణ సభ్యులు చిన్నయ్యస్వామి, రాజు, సన్నీ, మహేందర్‌చారి, పాండు, మల్లేష్‌గౌడ్ తదితరులు మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం జేవంతు, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవూఫ్, బాకారం మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్, సర్పంచ్ శ్రీనివాస్, తోల్‌కట్ట మాజీ ఎంపీటీసీ రవీందర్, ఉపసర్పంచ్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నిరుపేదలకు అండగా సర్కార్

చేవెళ్ల: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల మండలంలోని 15 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ క్రిష్ణయ్యతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎంపీపీ విజయలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

క్యూనెట్ కేసులో మరొకరి అరెస్ట్



ఉపేంద్రనాథ్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: మల్టీ లెవల్ మార్కెటింగ్(ఎంఎల్ఎం) క్యూనెట్ కేసులో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు మరొకరిని అరెస్ట్ చేశారు. కర్నూలు జిల్లా, చిన్నంపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ ఉపేంద్ర నాథ్ రెడ్డిని సీసీఎస్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ (క్యూనెట్)పై మహంకాళి పోలీస్ స్టేషన్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి. అనంతరం అదనపు సీపీ(ఎస్ఐటీ) ఆదేశాల మేరకు ఈ కేసులను హైదరాబాద్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో వి-అంపైర్ పేరుతో నకిలీ కంపెనీలు ఏర్పాటు చేసినట్లు దర్యాప్తులో గుర్తించిన అధికారులు 15 మంది నిందితులపై కేసులు నమోదు చేశారు. వీరు అధిక లాభాలు ఆశ చూపించి నిరుద్యోగులు, గ్రామీణులు, అమాయకుల నుంచి డబ్బులు సేకరించినట్లు గుర్తించారు. ఈ క్రమంలో ప్రధాన నిందితులు రాజేష్‌ఖన్నా, సీహెచ్ ఉపేంద్రనాథ్‌రెడ్డి ప్రేరణ క్లాసులు నిర్వహించి సామాన్యులను మల్టీ లెవల్ మార్కెటింగ్‌లో పెట్టుబడులను ఆకర్శించేవారు, ఈ క్రమంలో పెట్టుబడుల పెట్టిన వారికి నెలకు రూ.20 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు సంపాదించుకోవచ్చని ఆశ చూపారు. రిజిస్ట్రేషన్ పేరుతో ఒక్కో బాధితుడి నుంచి రూ.50 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు చార్జీల రూపంలో వసూలు చేశారు. ఇదే తరహాలో దాదాపు 163 మంది బాధితుల నుంచి రూ.3 కోట్ల వరకు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. విహాన్ డైరెక్ట్ సెల్లింగ్‌లకు చెందిన 35 బ్యాంకు ఖాతాల్లోని రూ.54 కోట్ల నగదును సీజ్ చేసిన పోలీసులు ఇప్పటివరకు 15 మంది నిందితుల్లో 9 మందిని అరెస్ట్ చేశారు.

పోలీసు విధులకు ఆటంకం..

రెడ్డి సంఘాల నేతలపై కేసుల నమోదు

బంజారాహిల్స్: ముందస్తు సమాచారం లేకుండా మంత్రుల నివాసాలను ముట్టడించడమే కాకుండా మంత్రి కాన్వాయ్‌కి అడ్డుపడి గన్‌మెన్‌లను దూషించడంతో పాటు పోలీసు విధులకు ఆటంకం కలిగించినందుకు రెడ్డి సంఘాలకు చెందిన 15 మందిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ రెడ్డి సంఘాలతో పాటు రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12లోని మంత్రుల నివాసాలను ముట్టడించే ప్రయత్నం చేశారు. మంత్రి జగదీశ్వర్‌రెడ్డి కాన్వాయ్‌ను అడ్డగించేందుకు ప్రయత్నించిన వారు ఆయన గన్‌మెన్‌లను దూషించారు. పోలీసులు వారిని నిలువరించేందుకు ప్రయత్నించగా వారి విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ వెంకటేష్ ఫిర్యాదు మేరకు సంతోష్‌రెడ్డి, రామిరెడ్డి, మాధవరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, దయాకర్ రెడ్డి తదితరులతో సహా 15 మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాన్‌షాప్‌ల్లో హుక్కా ఫ్లేవర్ల విక్రయం

ఇద్దరి అరెస్ట్

హస్తినాపురం: పాన్ షాపుల్లో నిషేధిత హుక్కా ఫ్లేవర్లను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేంధర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మజీద్‌గల్లీకి చెందిన మహ్మద్ సంయుల్లా షరీఫ్, మహ్మద్ ఇదయాతుల్లా షరీఫ్ నిషేధిత హుక్కా ఫ్లేవర్లను కొనుగోలు చేసి పాన్‌షాపులలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమవారం రాత్రి పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి భారీగా హుక్కా ఫ్లేవర్లు, హుక్కా పాట్, హుక్కా స్మోకింగ్ పైపులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



పోలీసుల అదుపులో నిందితులు

లారీ ఢీకొని.. ఆర్టీసీ కండక్టర్ దుర్మరణం

- బస్సు దిగే సమయంలో వేగంగా ఢీ కొట్టిన లారీ
- అక్కడికక్కడే మృతి



ప్రమాదానికి కారణమైన లారీ



ప్రమాదానికి గురైన బొలేరో, ఆర్టీసీ బస్సు

శామీర్‌పేట్: కరీంనగర్ – హైదరాబాద్ రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సు కండక్టర్ మృతి చెందగా డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం జినోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. సిద్దిపేట జిల్లా, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ బ్యాగరి నవీన్‌కుమార్, వెంకటాపూర్‌కు చెందిన బాలనర్సయ్య(49) మంగళవారం ప్రయాణికులతో జేబీఎస్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలో శామీర్‌పేట మండలం, అచ్చాయిపల్లి చౌరస్తా వద్ద ప్రయాణికులను దించేందుకు రోడ్డుపక్కన బస్సును నిలపడంతో అదే సమయంలో వేగంగా వచ్చిన బొలేరో వాహనం బస్సును ఢీ కొట్టింది. దీంతో బస్సు డ్రైవర్, కండక్టర్‌లు కిందకు దిగి బస్సును పరిశీలిస్తుండగా అదే సమయంలో వెనకనుంచి వేగంగా వచ్చిన బస్సును ఢీ కొట్టింది. దీంతో బస్సు బొలేరో వాహనాన్ని తగలడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో కండక్టర్ అక్కడికక్కడే మృతిచెందగా, బస్సు డైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతోన్మాదాన్ని తుదముట్టించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో మతోన్మాదాన్ని తుదముట్టించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో '76 ఏళ్ల స్వాతంత్రం, ఎదురవుతున్న సవాళ్లు' అంశంపై సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తయినా నేటికీ ప్రజలకు రక్షణ కరువైందన్నారు. దళితులు, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతుందన్నారు. మణిపూర్ రావణకాష్టంలా మారినా కేంద్ర ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశంలో విద్యా, వైద్యం అందక బలహీన వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉపాధి లేక యువ అయోమయంలో ఉన్నారన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శి దశరథ్, డాక్టర్ అల్వాల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

జెండాను అవమానించిన వారిపై కేసులు

చాంద్రాయణగుట్ట: ఓ రౌడీషీటర్ మృతదేహంపై జాతీయ జెండాను చుట్టి అవమానించిన వ్యక్తులపై చాంద్రాయణగుట్ట పోలీసులు కేసులు నమోదు చేశారు. చాంద్రాయణగుట్ట పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రౌడీషీటర్ షేక్ సయీద్ బావజీర్ ఈ నెల 11న తెల్లవారుజామున హత్యకు గురయ్యాడు. దీంతో అతడి అనుచరులు ఖాజా అలీముద్దీన్‌తో పాటు పలువురు ఉస్మానియా మార్చురీలో బావజీర్ మృతదేహంపై జాతీయ జెండాను కప్పి బార్కాస్ వరకు తీసుకొచ్చారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్ బావజీర్ మృతదేహంపై జాతీయ జెండాను ఎలా కప్పుతారని జాతీయ జెండాను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 14న స్థానిక బీజేవైఎం ఉపాధ్యక్షులు రాజేశ్ చాంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఖాజా అలీముద్దీన్‌తో పాటు మరికొందరిపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.